# కథాలోచన

ఎలాగైనాసరే ఏదో ఒక కథ వ్రాసి, శ్రీవారు వేసిన పందెం గెలిచి, ఆయన దగ్గరనుండి మూడువందల రూపాయలు సంపాదించాలి—అనే పట్టుదల నాలో పెరిగిపోయింది.

కథ అంటే కలంపడితే వచ్చేదనే, నా అభిప్రాయం. ఆ సాయంకాలం ఐదు గంటలలోగా ఒక్క కథేనా వ్రాయలేనా, అనే ధీమా ఉంది నాలో.

కుర్చీలో కూర్చుని డ్రాయర్ మీద నాలుగు తావుల తెల్లకాగితాలు పెట్టి, పెన్ను చేతి వేళ్ళకు అతికించేను.

ఏ రకమైన కథ వ్రాయాలి? ఎలా వ్రాస్తే బాగుంటుంది? ఎట్లాగైనాసరే ఈ తెల్ల కాగితాలన్నీ ముత్యాల్లాంటి నా అక్షరాలతో నింపెయ్యాలి—అని నా పెన్నును కాగితం దగ్గరకు తీసుకువెళ్ళాను.

'కమాన్ రైట్ సమ్‌తింగ్, క్విక్' అంటూ తెల్ల కాగితం నా వైపు ఆశగానూ, ఆకలిగానూ చూస్తోంది.

'ఊ, త్వరగా కానియ్. నేను ఆగలేక పోతున్నాను' అంటోంది కలం.

వీటికంటె ఎక్కువ ఆరాటపడిపోతున్నాను నేను. ఏదో ఒక కథ వ్రాసి, సాయంకాలం ఆఫీస్ నుంచి ఆయన వచ్చేసరికి చూపించి మూడు వందలు లాగాలి. 'హు....నేనే గెలిచాను చూడండి' అంటూ ఆయన్ని ఏడ్పించాలి అనేదే నా ఆరాటం.



ఎట్లాగూ కథ వ్రాయలేకపోను. వ్రాస్తాను. పందెం గెలుస్తాను. ఔనూ....ఇంతకూ ఆ మూడు వందల రూపాయలు ఏం చెయ్యను?

ఆ డబ్బుతో ఒక పట్టుచీర కొనుక్కుంటే? వెధవ చీరెలు ఎందుకులే, ఇప్పటికే బోలెడన్ని బీరువాలోపడి 'బయటకు తియ్యవోయ్' అని ఏడుస్తున్నాయ్.

పోనీ ఆ డబ్బుతో హైద్రాబాద్ వెళ్ళి అక్కయ్యను, పిల్లలను చూసివస్తే?

అబ్బే అట్లా చెయ్యకూడదు. మొట్టమొదటి కథా ఫలితాన్ని అలా కంటికి కనబడకుండా చెయ్యకూడదు.

ప్రతిక్షణం కంటికి కనబడే వస్తువు కొంటే బాగుంటుంది.

బీరువాలు, మంచాలు, కుర్చీలు ఇటువంటివి అన్నీ ఉన్నాయి.

జె. భారతీ భరత్

పోనీ, ఆ డబ్బుతో ఒక కాసు బంగారం ఐనా రాదు.

ఫేన్ ఐతే? ఆ....ఓ....కే. అంతే....ఇంట్లో ఒక సీలింగ్ ఫేనూ, ఒక టేబుల్ ఫేనూ ఉన్నా మరొకటి కొంటాను. దాని దగ్గరే పడుకుంటే హాయిగా నిద్రపడుతుంది.

ఔనూ....ఈ ఆలోచనలన్నీ ఇప్పుడు పనికి రావు. ముందు కథ వ్రాయాలి—అనుకొని కథాలోచనకు దిగాను.

ముందు ఏమని వ్రాయను? అనుకుంటూనే, ఏదైనా వ్రాసే ముందు కాగితం పైన నా ఇష్ట దైవం నామాన్ని ఓం శ్రీ వేంకటేశ్వరాయనమః అని వ్రాసే అలవాటుతో బోసిగా ఉన్న తెల్ల కాగితం ముఖాన (కాగితం పై భాగాన) కాస్త పెద్ద అక్షరాలతో బొట్టు పెట్టాను.

ఏం వ్రాసినా పైన అలా వ్రాయాలా అంటూ ఆయన నన్ను హేళన చేస్తూంటారుగాని, ఎవరి పిచ్చి వాళ్ళకి ఆనందం కదూ.

అలా ముందు వ్రాయకపోతే ఆ దైవాన్ని నిర్లక్ష్యం చేశావంటూ నా మనసు పీకేస్తుంది.

అసలు దైవస్మరణ చెయ్యకుండా పని మొదలు పెడితే నాకు అన్నీ ఆటంకాలే అనిపిస్తాయి.

ముందు మానవ ప్రయత్నం, ఆపై దేవుని దయ అంటూ ఉంటారు ఆయన.

కాదు—ముందే దేవునిదయ కావాలి. ఆపైన



మనం ఏం చేసినా ఐపోతుంది అని వాదిస్తాను నేను.

ఒకోసారి నేను అనుకున్న పని అవ్వకపోతే ఆ ఏడు కొండలవాడిని తిడతానులెండి.

కాని తరువాత ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది అనుకొని నా తప్పును ఒప్పుకొని, ఆ తిట్టిపోసిన తిరపతయ్యకే దణ్ణాలు కూడా పెట్టేస్తూంటాను.

ఎటువంటి కథ వ్రాయను ? అనే ఆలోచనలతో ఆ భగవంతుని నామాన్నే నాలుగుసార్లు నల్లగా దిద్దాను.

అనగా అనగా ఒక రాజు. ఆ రాజుకు ముగ్గురు కొడుకులు. అంటూ మొదలెట్టి ఆ రాజు మీద ఒక కథ వ్రా స్తే ఎలా ఉంటుంది ?

'ఛ....ఇదెక్కడిదో మీ నాయనమ్మ దగ్గర విన్న కథోయ్' అని ఆయన హేళన చెయ్యవచ్చు. అందుకని ఈ రాజు, గాజు కథలు వ్రాయను, వ్రాయకూడదు.

అది అమావాస్య, ఆదివారం. అర్ధరాత్రి పన్నెండు గంటలయ్యింది. ఆ చీకటిలో ఇద్దరు వ్యక్తులు అలజడిలేకుండా, పిల్లి పాదాలతో నడిచి వస్తున్నారు, అని ఒక భయంకర థ్రిల్లింగ్ కథ వ్రా స్తే? అంతటి చీకట్లోని మనుష్యులు నీ కెలా కనిపించారమ్మా? టార్చిలైటు అడిగితే ఇవ్వనూ? అని ఆయన నవ్వుతారేమో ?

నిజమే అటువంటివారే బాబూ.

ఎప్పుడైనా సరదాగా ఆయనతో, కథ వ్రాసి ఏ పత్రికకైనా పంపుతానంటే చాలు — సోది చెప్పుకొస్తారు.

'నీకెందుకమ్మా అంత శ్రమ, బాబుకు, నాకు ఇంత తిండి పెట్టి పంపి, హాయిగా ఫేన్ వేసుకొని పుస్తకాలు చదువుకో.

కథ కోసం ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు. వేళకు మాకు తిండి కూడా కరువైపోతుంది బాబూ నువ్వు కథలు వ్రాయడం మొదలుపెడితే.'

ఇలా కథ వ్రాయాలనే నా ఉత్సాహాన్ని తేలిగ్గా నవ్వి తీసి పారేస్తారు.

ఆయన అలా అంటున్నారంటే నేను బి. ఏ. చదివినా తెలివి తక్కువ దద్దమ్మననేగా—ఆయన భావం.

ఆయన నవ్వుతో నాకు పౌరుషం వచ్చేసింది ఈ రోజు అట్లా జరగడంతో.

"వెధవ కథ కోసం బుర్ర పాడుచేసుకోవడం దేనికి? కథ వ్రాస్తానండి అని మీతో చెప్పడం నాదే బుద్ధి తక్కువ. ఏదో ఎంకరేజ్ చేస్తారుగదా అని ఇంతకాలం ఆశపడ్డాను.

సాయంత్రం మీరు వచ్చేటప్పటికి చూడండి. మాంచి కథ వ్రాసి మీ ముందు పడేస్తా. మళ్ళీ మళ్ళీ కథ చదివి ఆశ్చర్యపోతారు." అంటూ విసురుగా వంటగదిలోకి వెళ్ళిపోయాను.

ఆయన నవ్వుతూ నా చేయి పట్టుకుని, 'ఓకే సుశీ! సాయంత్రం నేను వచ్చేసరికి మాంచి కథ వ్రాసి ఉంచు. నీవు వ్రాస్తే మూడు వందల రూపాయలు నీకు ఇస్తాను.' అంటూ పందెం వేసి ఆఫీస్‌కు వెళ్ళిపోయారు.

దాంతో కథ వ్రాయాలనే పట్టుదలతోబాటు, మూడు వందలు తీసుకోవాలి అనే ఆదుర్దా కూడా పెరిగిపోయింది.

కథ వ్రాసే కంగారులో వంట చేసి మాసిన బట్టలైనా విప్పకుండా, చెమటలు పట్టిన చర్మానికి స్నానమైనా చేయించకుండానే కాగితాలు పెన్ను తీసుకుని కూర్చున్నాను.

గడియారం పదకొండు గంటలు కొట్టడంతో గుండె దడదడలాడింది.

అరె! అప్పుడే పదకొండు అయ్యిందే. గంట నుండి ఆలోచిస్తూన్నా కథ ఒక పట్టాన వ్రాత రూపంలో రాలేకపోతోందే.

ఎందుకు? బి. ఎ. డిగ్రీ అందుకుని వంట ఇంటి ఉద్యోగం వెలగ బెడుతున్నాను.

మరి డిగ్రీలులేని వేమన, పోతన వంటి వారు పెద్ద పెద్ద గ్రంధాలు ఎలా వ్రాసారబ్బా ?

మూడు వంతులు వాళ్ళను ఆ సరస్వతీ దేవి ఆవరించి ఉంటుంది.

ఇలా తర్కించుకుంటూ, కథ వ్రాయలేని విసుగుతో కుర్చీ వెనక్కి తల వాల్చి, డ్రాయర్ క్రిందికి కాళ్ళు జాపి కళ్ళు మూసుకొని ఆలోచనలో పడ్డాను.

మన ఆలోచనలు సాగకపోయినా, కాల చక్రం సాగకపోదు. అందులోనూ మా ఇంటిలోని గడియారం ఒక పావుగంట ముందుగానే పరుగెడుతుంది కూడానూ.

కాన్వెంట్‌కు వెళ్ళిన బాబు, 'అమ్మా, అన్నం, అమ్మా లే' అంటూ నా చేయి పట్టుకొని లాగడంతో గాని, నేను నిద్రపోతున్నానని అనుకోనేలేదు.

కరెంట్ ఎప్పుడు పోయిందో నాకు తెలియనే లేదు. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది.

నుదుటి మీది బొట్టు ముక్కుమీదకు జారుతోంది జిగురులా.

కాన్వెంట్‌లో సెకండ్‌క్లాస్ స్టూడెంట్ ఐన మా బాబు అలా నన్ను లేపడంతో నా ఆలోచనకు అంతరాయం కలిగింది.

'అమ్మా, త్వరగా రా' అంటూ ఇంకా చేయి పట్టుకుని లాగడంతో, 'పాడుగోలా నువ్వూ, పో బయటికి. పోయి తిను' అంటూ కథ వ్రాయలేని అసమర్థతను వాడి మీద చూపించి, నా చేయి లాక్కుని వాడి వీపు మీద ఒకటి వడ్డించాను.

బాబు భయపడిపోయి, పరుగున వీధిలోకి వెళ్ళిపోయి, 'అమ్మా—ఊ ఊ' అంటూ గట్టిగా ఏడ్వడం మొదలు పెట్టాడు.

వాడి ఏడుపు వినబడడంతో నా కోపమంతా దిగిపోయింది.

ఎర్రగా ఉన్న బొగ్గు మీద నీరు చల్లితే నల్లబడి నట్లు, బాబు కన్నీటితో నాముఖం మాడిపోయింది.

ఛ....చెత్త కథకోసం, చిరాకుతో బాబును తిట్టి కొట్టానే, అనుకుంటూ పరుగున వెళ్ళి 'బాబూ' అంటూ నవ్వుతూ వాడి పసిడి ముద్ద లాంటి బుగ్గలమీద ముద్దులు పెట్టుకొని, 'ఇంకెప్పుడూ తిట్టనమ్మా, ఏడవకమ్మా. మా బాబు మంచివాడు కదూ' అంటూ వాడి కన్నీటిని కొంగుతో తుడిచి, రెండు చేతులతో బాబు నడుము పట్టి, ఎత్తి ఆట బొమ్మలా అటూ ఇటూ ఊపుతూ, వాణ్ణి నవ్విస్తూ వంట గదిలోనికి తీసుకు వెళ్ళాను.

'అమ్మా ఇంకెప్పుడూ తిట్టకమ్మా. నాకు ఎంత భయం వేసిందమ్మా. అన్నం పెట్టవేమో అనుకున్నానమ్మా. అసలే నాకు ఆకలి వేస్తోంది' వాడిపోయిన ముఖంతో నావైపే చూస్తూ అంటున్నాడు.

'నేను ఏదో వ్రాసుకోవాలి. మరి నువ్వు అల్లరి చేస్తే ఎలా. పని చెడిపోదూ' అంటూ వాడిని బుజ్జగించి, ఒక్క పూట బడి కావడంతో ఇంట్లో ఉంటే అల్లరి చేస్తాడని, నా కథకు ఆటంక మౌతాడని—భోజనం చేసాక, 'ప్రక్క ఇంటి పిల్లలతో సాయంత్రం వరకూ ఆడుకోమ్మా. ఈ మధ్యలో రాకేం' అంటూ నచ్చ జెప్పి వాణ్ణి బయటికి పంపి తలుపు వేసేసుకున్నాను. ఎవరైనా వస్తే మళ్ళీ నా కథకు అడ్డు తగులుతారని.

బాబోయ్. ఒంటిగంట ఐపోయింది. ఇంకా కథ లేదు. కథకు దారీ లేదు. త్వర త్వరగా వ్రాసెయ్యాలి. అనుకుంటూ పరుగున వచ్చి కుర్చీలో వ్రాలాను.

మళ్ళీ నా కథ మామూలేగా. ఏ మా కథ ఏ మా విధానం — అంటూ ఆలోచన మొదలు పెట్టాను.

అదేమిటోగాని నాకే ఆశ్చర్యం వేసింది. ముందు వచ్చిన కథలు కూడా నా బుర్రలో తట్టడం మానివేసాయి.

నుదుటి మీద కొట్టుకున్నా. పెద్ద మెదడు మీద మొట్టుకున్నా. చిన్న మెదడుకు మొర పెట్టుకున్నా—ప్చ్ .... లాభం లేదంటూ తల పోటు అనే ఆయుధంతో నా మీదికి యుద్ధానికి వచ్చాయి—నువ్వు పందెంలో ఓడి తీరాలంటూ.

నేను తక్కువ తిన్నానా ఏమిటి? నీ తల పోటు ఆయుధానికి మందు వుందిలే అంటూ మందు తీసుకొచ్చాను-మీరే ఓడిపోతారంటూ.

నుదుటిమీద ఆయుధాన్ని ఉపయోగించి కళ్ళు మూసుకుని కుర్చీ వెనుకకు తల వాల్చాను.

కళ్ళైతే మూసుకున్నాను గాని కథ కోసం వెదకడం మానలేదు.

'ఇంటర్ చదువుతున్న శాంతి అను అమ్మాయి తన క్లాస్‌మెట్ ఐన రవి అను అబ్బాయిని ప్రేమించింది.' అని వాళ్ళ మీద ఒక బ్యూటిఫుల్ లౌవ్‌లెటర్స్‌తో స్టోరీ వ్రాస్తే?

ఈనాడు లోకంలో వింటున్న సీన్లూ. కంటున్న సీన్లూ ఇవేగా.

ఏ పార్కుల్లో చూచినా ఈ జంటలేగా. ఏ సినిమాల్లో చూచినా ఇవే కథలుగదా. 'ఏదో కాపీ కొట్టేసి ఉంటావు' అని ఆయన అంటే అనవచ్చు.

ఇటువంటి ప్రేమ కథలు వ్రాయకూడదు. ఇంకో వెరైటీ కథ ఏదైనా వ్రాస్తే బాగుంటుందేమో అని మళ్ళీ ఆలోచనలో పడ్డాను.

ఏమేమో తలాతోక లేని కాకమ్మకథలు వస్తున్నాయి కాని ఆలోచనలకు అంతంలేకుండా పోయింది.

కళ్ళు మూసుకున్న నేను ఆ ఆలోచనలలోనే మెల్లగా నిద్రలోకి జారుకున్నాను.

ఎంత సేపు నిద్రపోయానో నాకే తెలియదు. తలుపుల మీద దబదబలాడడంతోనూ, 'అమ్మగారండోయ్' అంటున్న పనిమనిషి కాంతమ్మ అరుపులతోనూ ఉలిక్కిపడి లేచాను.

పరుగున వెళ్ళి వీధి తలుపు తీసి మూతలు పడుతున్న కళ్ళను నులుముకుంటూ నిలబడ్డాను.

ఆ ముసల్ది నోరు ఆవులించి చూస్తూ అక్కడే నిలబడిపోయింది కళ్ళు తేలవేసి చూస్తూ.

అప్పటికి గాని నా ఆకారం ఎలా ఉందో నాకే తెలియలేదు, చెమటతో తడిసిపోయిన జాకెట్టు, వంట మసి మరకలతో నలిగి మాసిపోయి ఉన్న చీరె. ప్రొద్దుటి నుండి తైల సంస్కారం లేక పక్షి రెక్కల్లా గాలిలో తేలియాడే నా నల్లని కురులు చూచేసరికి ఎలా ఉంటుంది మరి!

ఎప్పుడూ నీట్‌గా ఉండే నేను, నవ్వుతూ గలగలా తిరిగే నేను అలా డీలా పడిపోవడంతో అది కంగారు పడిపోయింది ఒక వైపు ఆశ్చర్యపోయినా.

ఇంకా అక్కడే ఎక్కువ సేపు నిలబడి ఉంటే వీధిలో వెళ్ళేవాళ్ళు కూడా కళ్ళు తిరిగిపడిపోతారని భయం వేసింది నాకు.

'ఏమిటే అలా చూస్తున్నావ్! రా లోపలికి' అంటూ కోపంగా చూచాను — దాని చూపులకు విసుక్కుంటూ.

శాసనమండలి సభ్యురాలు



## శ్రీమతి రోడామిస్త్రీ

1974వ సంవత్సరం జూలై 1వ తేదీన లెజిస్లేటివ్ కౌన్సిలుకు నామినేటు అయినారు శ్రీమతి మిస్త్రీ. హైదరాబాదులో సంఘ సేవ, రాజకీయ రంగాల్లోని శ్రీమతి మిస్త్రీని ఎరుగని వారుండరు. అతి చురుకుగా, పట్టుదలతో, సమర్థతతో ఎలాటి పనైనా ఆమె నిర్వహించగలరన్న ప్రఖ్యాతి పాతిక సంవత్సరాల నాడే ఆమె ఆర్జించుకున్నారు.

1957 నుంచి 1967 వరకు అసెంబ్లీలోను, 1968 నుంచి కౌన్సిలులోను సభ్యురాలిగా ఉంటూనే వున్నారామె. 1969 నుంచి 1972 వరకు స్త్రీ సంక్షేమ, పర్యటన శాఖామంత్రిగా కూడా పని చేశారు.

సంఘసేవా రంగంలో ఆమె – ఇండియన్ కౌన్సిలు ఆఫ్ సోషల్ వెల్ఫేర్ ఆంధ్ర శాఖకు అధ్యక్షురాలిగా వుంటూ అనేక కార్యక్రమాలకు సారథ్యం వహిస్తున్నారు. వాటిలో చెప్పుకోదగినవి- నగరంలో అనేక కేంటీన్ల ద్వారా రెండున్నర వందల మంది స్త్రీలకు ఉపాధి కల్పిస్తున్న విమెన్స్ ఎంప్లాయ్‌మెంట్ స్కీము; ప్రభుత్వం నుంచి యాజమాన్యాన్ని తీసుకుని శివరాంపల్లి దగ్గర్లో నడిపిస్తున్న ఆరామ్‌ఘర్ అన్న వికలాంగుల, అశక్తుల శరణాలయం; సికింద్రాబాదులో 'తృప్తి' అనే పేరున స్థాపించబడి మొదటి సంవత్సరంలోనే 30 లక్షల రూపాయల వ్యాపారాన్ని చూపిన మహిళా సూపర్ బజారు – ఇవన్నీ శ్రీమతి మిస్త్రీ సమర్థతను చాటి చెప్పుతాయి. ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్, దక్షిణ మధ్య రైల్వే ప్రాంతీయ సలహా సంఘం, క్షయ వ్యాధి నిర్మూలనా సంఘం మొదలైన అసంఖ్యాక కమిటీలు, సంస్థలలో ఆమె సభ్యురాలిగా వున్నారు.

పర్యటన శాఖా మంత్రిగా వున్నప్పుడు ఆమె ఢిల్లీలో జరిగిన జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, కాన్ఫరెన్సులు, పునశ్చరణ తరగతులకు అధ్యక్షురాలిగా, అధికార ప్రతినిధిగా హాజరైనారు. 1958, 59 సంవత్సరాల్లో జపాన్, స్వీడన్ దేశాల్లో జరిగిన సంఘసేవా మహాసభలలో అంతర్జాతీయ ప్రతినిధివర్గ సభ్యురాలిగాను, అమెరికన్ ప్రభుత్వం ఆహ్వానంపైన 1964 లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాను, వృద్ధుల సంరక్షణ గృహాల నిర్వహణను గురించి పరిశీలించడానికి రిపబ్లిక్ ఆఫ్ చైనానూ సందర్శించారు. పురాతన వస్తువులను సేకరించడం, ప్రయాణాలు, క్రీడలు తన సరదాలు–అంటారామె.

—జె. ఆర్.

'అమ్మగోరూ, అలా ఉన్నారేందమ్మా. ఒంట్లో బాగోనేదాండి. కూడు తిన్నారోలేదో అల్లాగ నీరసం ఐపోనారు. యాందమ్మగోరూ!' అంటూ లోపలికి వచ్చింది అది.

'ఏం లేదే. మీ అయ్యగారు ప్రొద్దుట ఆఫీస్‌కు వెళ్ళేటప్పుడు నాతో పందెం వేసేరు. సాయంత్రం ఆయన వచ్చేసరికి నేను ఒక మంచి కథ వ్రాస్తే మూడువందల రూపాయలు ఇస్తానని పందెం వేసి వెళ్ళారు. దానికోసం ఆలోచిస్తున్నానే' అంటూ గడియారం వైపు చూశాను.

అమ్మో....అప్పుడే నాలుగు కావస్తోంది. ఇంకో గంటలో ఆయన వచ్చేస్తారు! అనుకుంటూ కంగారు పడిపోతున్నాను నేను.

'ఇంతకీ కథ రాసారమ్మా' అంటూ ఆరా తీసింది. ఆ కథ లేమిటో తనకు తెలిసిన దానిలా.

'ఇంకా వ్రాయలేదే, ఆయన వచ్చే సమయానికి కదా' అంటూ గిన్నెలు ఖాళీ చేస్తున్నాను నేను.

'ఇంకా ఎప్పుడు రాత్తారమ్మా. కథలు కావత్తే బోల్లన్ని నాను సొప్తాను. కథలంటే ఏవో ఎక్కడో ఉంటాయ్యా? మాలాంటోళ్ళ బతుకులన్నీ కథలే కదమ్మా.

ఎవరి కతో ఎందుకు సొప్పండి. నా బతుకుని సెప్తాను కథగా రాయండమ్మా. నా చిన్నప్పుడే అమ్మ చచ్చిపోయినాది. మా అయ్య తాగుబోతోడు. అదు, నేను ఒద్దు మొర్రో అన్నా ఇనిపించుకోక నాలుగొందల రూపాయిలికి కక్కుర్తి పడి నన్ను మూడో పెళ్ళి ముసిలోడికిచ్చి పెళ్ళి సేసినాడు. పెళ్ళైన ఏడాదికే ఆ ముసిలోడు గుటుక్కుమని, ఇరవై యేళ్ళన్నా రాకుండానే నా రాత ఇలా సేసేసే డమ్మో!' అంటూ ఏభై యేళ్ళకే ముసలి తనం వచ్చేసి, నడుం వంగిపోయిన కాంతమ్మ తన గతించిన జీవితాన్ని తలచుకొని ఏడ్పు మొదలు పెట్టింది.

'ఊరుకోవే కాంతమ్మా. కథలంటే నీకు సానా బాగా తెలుసే. నువ్వు సొప్పిన కథ రాత్తే అయిగోరు రూపాయిలు ఇయ్యరు మరి.' దానిలా యాసగా మాట్లాడాను నవ్వుతూ.

అది కళ్ళు తుడుచుకుంది సిగ్గుతో, 'యాండమ్మా నా కథ రాయరా? బాగోనేదాండి' విచారంగా చూచింది నా ముఖంలోకి.

'అదికాదే నీ కథ వ్రాస్తే అయ్యగారు డబ్బులివ్వరే. ఐనా ఆ కథ గొడవేదో నేను పడతాను కాని నీ పని చూసుకొని వెళ్ళిపో' అని చెప్పేసి మళ్ళీ కుర్చీలో కూర్చున్నాను కథ కోసం.

గడియారం నాలుగు గంటలు కొట్టడంతో గుండె దడదడలాడింది.

ఇంతలో 'అమ్మగారూ బట్టలు వెయ్యండి. రేపు రేపు పెద్తాను.' అంటూ చాకలి ఇప్పుడే చావాలి. పోరా సన్యాసీ అని మనసులో తిట్టాను కాని పైకి అనలేక పోయాను.

ఇంట్లో బట్టలన్నీ మాసిఉన్నాయి. ఈ రోజు వేస్తే గాని నాలుగు రోజుల వరకూ తీసుకురాడు. వెయ్యకపోతే నేను రేవు పెట్టుకోవాలి; విసుక్కుంటూ లేచి వాడికి బట్టలు వేసి వాడిని సాగనంపి, కుర్చీలోనికి మళ్ళీ చేరాను.



యమ్. లావణ్య సరస్వతి

ఉస్మానియా (హైద్రాబాదు) విశ్వవిద్యాలయంలో ఈమె-ఎమ్. ఎ. (తెలుగు) పరీక్షలో ప్రథమ శ్రేణిలో-ప్రథమురాలిగా 'డిస్టింక్షన్'తో ఉత్తీర్ణురాలైనది. మార్చినెలలో జరిగిన స్నాతకోత్సవంలో గురజాడ అప్పారావు బంగారు పతకాన్ని, మాడపాటి హనుమంతరావు బంగారు పతకాన్ని పొందిన-లావణ్య సరస్వతి ప్రస్తుతం విశ్వనాథ సత్యనారాయణగారి 'పురాణవైర గ్రంథమాల'ను ప్రధానాంశంగా తీసుకుని ఎమ్. ఫిల్ చేస్తున్నది.

పెన్ను చేతి వ్రేళ్ళమధ్య నలుగుతూందే కాని ఎంత వ్రాయాలనుకున్నా ఒక్క అక్షరం కూడా వ్రాయలేకపోయింది.

పని మనిషి చెప్పిన ఆమె జీవితం ఒక కథలా వ్రాస్తే బాగానే ఉంటుంది. కాని అందులో నా తెలివి తేటలు ఏమున్నట్లు?

ఈ డిగ్రీలు కనీసం ఒక చిన్న కథ వ్రాయడానికి కూడా పనికి రాకుండా పోతున్నాయే అని బాధ.

ఎట్లాగో వ్రాద్దాం అని కూర్చున్నా వెధవ సంసారం గోల ఒకటి.

తెల్లవారినప్పటి నుంచీ, పది గంటల వరకూ ఒకటే హడావుడి. వంట అయిందీ అంటే కంచాలు వాల్చెయ్యాలి. అదీ అయ్యిందంటే బట్టలు ఇవ్వాలి. ఆయన తలను దువ్వాలి.

కళ్ళకు జోడు కాళ్ళకు జోడు అందివ్వాలి. ఆయనను అలా పంపి బాబును కాన్వెంట్‌కు పంపాలి.

బాబు టాయిలెట్ దగ్గరనుండి బాక్సులో టిఫిన్ వరకూ అన్నీ సర్ది పంపకపోతే వాడిగోల మరీనూ.

ఈ మధ్య పదిరోజులనుంచి వాడికి మార్నింగ్ స్కూల్ కావడంతో ప్రొద్దుటే మరీ హడావుడి చేసేస్తున్నాడు.

వీళ్ళ సంగతి ఎలా ఉన్నా రోజుల వారీగా వచ్చే పోయే బంధువులనే రాబందులు.

సాయంత్రం మళ్ళీ మామూలే. వంట చేసే సరికి ఆయన, బాబు ఎవరో ఒకరు కబుర్లు చెబుతూనే ఉంటారు.

రాత్రి వేళలో తీరిగ్గా కథలు వ్రాద్దామా అనుకుంటే పదిదాటితే నిద్రకు ఆగలేను.

మరి ఇంకెలా కథలు వ్రాయగలను? అసలు వ్రాసే తీరికే లేదే నాకు.

పెద్ద పెద్ద నవలలు వ్రాసే అక్కలందరూ ఎలా వీలుచేసుకొని వ్రాస్తున్నారబ్బా?

వాళ్ళు సంసారం విషయాలు పట్టించుకోకుండా ఒక గదిలో కూర్చుని, ఎవరూ రాకుండా తలుపులు వేసుకొని వ్రాస్తారేమో!

నాకు అలా వారిలా సాగదు మరి. చుట్టాల దగ్గరినుండి చాకలివాడు వరకూ, పనివాళ్ళ దగ్గరినుండి పిండి వంటల వరకూ నేను చూసుకోక తప్పదు.

ఇటువంటి పనులన్నీ బరువెక్కి నా మీద కూర్చుంటే కథలు వ్రాసే అవకాశం ఎక్కడిది? నేనిక జన్మలో రచయిత్రిని కాలేను.

ఆ సంగతి తెలిసే ఆయన నాతో మూడు వందలు ఇస్తానంటూ పందెం వేసి ఉంటారు.

పోనీ ఏదో ఒక కథ వ్రాద్దామా అనుకుంటే మొదలు చివరలేని గాథలు తప్ప సరియైనవి నా గ్రంథాలయంలో, సారీ – నా మట్టిబుర్రలో లేవు. కథ ఎలా వ్రాయాలబ్బా! అంటూ మళ్ళీ ఆలోచనలో పడ్డాను.

ఒక అత్తగారు కోడలు ఉంటారు. రోజూ వాళ్ళిద్దరూ పోట్లాడుకుంటూనే ఉంటారు. మధ్యలో



పెళ్ళికి ముందు 'పెళ్ళికూతురు జడ అసలుదా నకిలీదా' అని పరీక్షించి చూడడం చాలా చోట్ల కనిపిస్తుంది. అలాగే పెళ్ళికూతురు నడకతీరు నుంచి అన్నిటినీ పరిశీలించి చూడడమూ ఉంది. పెళ్ళయ్యాక అమ్మాయికి పెట్టిన నగల నాణ్యత గురించీ, ఇచ్చిన పాత్రల బరువు గురించీ తర్క–వితర్కాలు జరపడమూ ఉంది. అయితే తర్క–వితర్కాలు ఎప్పుడు జరపడం అన్నదే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటో తెలుసుకునే ప్రయత్నం చేస్తే ఎలా ఉంటుంది?

కేరళలో ఒక చోట పెళ్ళివారు పెళ్ళికూతురిని తీసుకుని వెళ్ళిపోతుండగా–ఎవరో పెళ్ళికొడుకుకు చదివించిన వెండి పళ్లాలు అసలు వెండివి కావని ఆక్షేపించారట. దాంతో మాటా మాటా చెయ్యీ చెయ్యీ కలగజేసుకునేసరికి పెద్ద గొడవ చెలరేగింది. అంతలో ఎవరో–పాపం–పెళ్ళికూతుర మెడలోని బంగారు గొలుసు లాగారు. గొడవ పాకాన పడింది. కర్రలూ, ఇనుపకడ్డీలు పుచ్చుకుని పోరాటం జరిపారు. పోరాటం చివర చూస్తే – ఐదు మందికి బలమైన గాయాలు తగిలాయి. పెళ్ళికొడుకుకు తలనిండా గాయాలు తగిలాయి. గొడవ అంతా చల్లారాక చూస్తే అసలు గొడవకు కారణమైన పళ్ళాలు ఎలా మాయమయ్యాయో తెలియలేదట!

పాపం ఆ మగ మహారాజు అటు తల్లికి, ఇటు భార్యకు మధ్య నలిగిపోతుంటాడు. అని 'మగ మహారాజు' అనే టైటిల్‌తో కథ వ్రాస్తే ఎలాగుంటుంది?

అమ్మో..ఇంకేమైనా ఉందా? ఆయన ఇటువంటి కథ చదివారంటే నేను మా అత్తగారితో పోట్లాడి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న రోజులన్నీ గుర్తుచేసి దెప్పిపొడుస్తారు.

కాలం మనకోసం ఆగదుగా–కళ్ళు మూసుకొని ఊహాలోకంలో ఊగుతున్న నాకళ్ళను రెండు చేతులు వచ్చి చుట్టు ముట్టడంతో అదిరిపడ్డాను.

ఉలికిపాటుతో ఎవరో తెలుసుకున్న నేను అవమాన భారంతో క్రుంగిపోయాను. ఆ సమయంలో నేను పడిన బాధను మాటలలో వర్ణించలేనేమో.

ఒక్కసారిగా పాతాళానికి జారిపోతున్నట్లు బాధపడుతూ ముఖం వాల్చేసాను.

నేను పందెంలో ఓడిపోయినందుకు, ఆయనే నెగ్గినందుకు కోపం కూడా వచ్చింది.

'హు....చాల్లెండి.' కోపంతో ఆయన చేతుల్ని లాగేసాను.

'ఏదమ్మా నువ్వు వ్రాసిన కథ? చదివి వెంటనే మూడువందలు ఇచ్చేస్తాను' అంటూ ఆయనే టేబుల్ మీద ఎదురుగా ఉన్న తెల్ల కాగితాలు అందుకోబోయారు.

ఆయనకంటె రెట్టింపు వేగంతో నేను నా రెండు చేతులతోనూ ఆ కాగితాలు అందుకొని నా గుండెలకు హత్తుకున్నా. ఆయన ఎక్కడ ఏడ్పిస్తారో అని.

ఆయన మాత్రం తెలివి తక్కువ వారా! బలవంతాన ఆ కాగితాలు తీసుకొని, 'ఓం శ్రీ వేంకటేశ్వరాయనమః' అంటూ చదివి పకపకా నవ్వేసారు.

'సుశీ కథ ఇంతేనా? చాలా బాగుందే. పాపం ఇది ప్రొద్దుటనుండి సాయంత్రం వరకూ చాలా కష్టపడి వ్రాసి ఉంటావు.' హేళన చేయడంతో కోపం ముంచుకొచ్చింది. ఏడ్పు వస్తున్నా కనబడ లేదు కోపంలో.

'హు....మిమ్మల్ని చేసుకున్నాక నాకు ఖాళీ కూడా ఉండి చచ్చిందీ. వెళ్ళేవాళ్ళు వెళ్తుంటే వచ్చేవాళ్ళు వస్తూంటారు. ఇంకెక్కడి తీరిక' నీరసంగా అంటూ కుర్చీలోనే ఉండిపోయాను లేచే ఓపికలేక.

నా అవతారాన్ని, నా మాటలను చూసి ఆయన కంగారు పడ్డారు పాపం!

'సుశీ నీకథ ధోరణిలో సంసారమే మరచిపోయినట్టుంది. బాబేడీ?' అనడంతో 'బౌనండీ పాపం అప్పటినుంచి ఇంట్లోకే రాలేదు' అంటూ వీధిలోకి పరుగున వచ్చాను.

వాళ్ళ నాన్నగారిని చూసి ప్రక్క ఇంటినుంచి వచ్చిన బాబు–నేను మళ్ళీ తిడతానేమోనని అరుగు చివర కాళ్ళుచాపి కూర్చుండి వెళ్ళేవాళ్ళను, వచ్చేవాళ్ళను చూస్తున్నాడు.

'బాబూ' అంటూ ఆప్యాయంగా వాడ్ని రెండు చేతుల్లోకి తీసుకొన్నాను.

నా పరిస్థితిని చూసి నవ్వుతున్న ఆయన 'సుశీ! టిఫిన్' అనడంతో తోటకూర కాడలా మెడను వాల్చేసాను.

'ఏమండీ టిఫిన్....చేయలేదండి, ఇప్పుడే వస్తానుండండి' అంటూ బాబును దింపి వంట గదిలోనికి పరుగుతీసాను.

ఆయన ఏమనుకున్నారో ఏమోగాని నా వెనుకనే వచ్చి 'రచయిత్రీ మణిగారూ, ఈ పూట మీ వంటకు సెలవు మంజూరు చేయడమైనది. త్వరగా స్నానం చేసి టాయిలెట్ కండి. పిక్చర్‌కు పోయి హోటల్ భోజనం చేసి వద్దాం.' నవ్వుతూ నా చెరిగిపోయిన జుట్టును సరిచేస్తున్నారు.

'ఎంత మంచివారండీ మీరు.' అని పైకి అనేసాను, ఆయన మంచితనానికి మురిసిపోతూ.

త్వరగా రావాలి మరి అంటున్న మాటలతో 'నిజమే బాబూ, ఈ పూట ఇక వంట చెయ్యలేను, చేసే ఓపికా లేదు.' అనుకుని ఒక్క ఉదుటున టవల్ అందుకుని బాత్‌రూంలో చేరాను.

స్నానం చేసి చల్లబడిన నేను ఆ రోజంతా కష్టపడి సాధించినది తెలుసుకొని ఇంకెప్పుడూ కథ కోసం ఆలోచించను అని ఒట్టేసుకున్నా.

ఐనా నాకు పందెం ఏమిటి, ఆ మూడు వందలూ ఆయన దగ్గర ఉన్నా నా సొమ్ము కాదా ఏమిటి, అడిగితే ఆయనే ఇస్తారు అని సరిపెట్టుకున్నా.

కాని రేపు పనిమనిషి కాంతమ్మ 'అమ్మగోరూ, కతరాసే రాండి. మూడొందలు ఇచ్చేసే రాండి,' అని అడిగితే 'అ....అ....' అంటూ చెప్పేస్తే సరి! నా అబద్ధాల ఆలోచనలకు నేనే నవ్వుకున్నా. □